


భూహక్కు పత్రాల్లో సవరణలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

భూహక్కు పత్రాలలో తప్పులుంటే మార్పులు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో భూ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టరు నిశాంత్ కుమార్ సూచనలిస్తూ భూహక్కు పత్రాలలో ఫొటో మిస్సింగ్, వివరాల నమోదులో తప్పులుంటే మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. తప్పులున్నా, భూమి వివరాలు నమోదు కాకున్నా రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. మ్యుటేషను దరఖాస్తు ద్వారా మార్పులు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ విషయాన్ని రైతులందరికీ విఆర్ఒలు తెలియజేయాలన్నారు. నోటీసులు రైతులందరికీ వ్యక్తిగతంగా అందజేసి, రశీదులు తీసుకొని రికార్డు చేయాలన్నారు. భూ సర్వేకు సంబంధించిన మొత్తం రికార్డు భద్రపరచాలని ఆదేశించారు.



పొలంలో కోసిన వరిచేను



కోసిన వరిచేనును తరలిస్తున్న రైతులు

ఆకాశంలో కారుమబ్బులు..

అన్నదాత గుండెల్లో గుబులు

నూర్పు చేసి అమ్మకానికి సిద్ధంగా ధాన్యం రాశులు

ఆకాశంలో కారుమబ్బులు అన్నదాతల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో తుపాను కారణంగా దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ వర్షాలు పడతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల ఆందోళనకు అద్దం పట్టినట్టుగా ఆకాశంలో మార్పులు మొదలయ్యాయి. ఏ క్షణాన వర్షాలు పడి తమ కొంప ముంచుతాయోనని దిగులు చెందుతున్నారు.

ప్రజాశక్తి-సాలూరు

జిల్లా వ్యాప్తంగా ఒకవైపు వరి కోతలు, పంట నూర్పుళ్లలో రైతులు తలమునకలై ఉన్నారు. ఇలాంటి తరుణంలో కనిపిస్తున్న కారుమబ్బులు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలు పడితే కోలుకోలేని దెబ్బ తినాల్సి వస్తుందని ఆందోళనకు గురవుతున్నారు. వరికోతలు కోసి ఒకటి రెండు రోజులపాటు మడులలోనే చేను ఆరేలా ఉంచాల్సిన అవసరముంది. ఇలాంటి పరిస్థితుల్లో వర్షం పడితే ధాన్యం కంకుల నుంచి గింజలు పూర్తిగా రాలిపోయే, తడిచే అవకాశం ఉంటుంది. దీనివల్ల రైతు కష్టం బుగ్గిపాలవుతుంది. అదే విధంగా కొంతమంది రైతులు వరి నూర్పులు చేసి ధాన్యాన్ని అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. బస్తాలకు ధాన్యం పట్టి కళ్లాల్లోనే అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఇలాంటి సమయంలోనూ వర్షం పడితే ధాన్యం రంగు మారే ప్రమాదం పొంచి ఉంది. దీంతో రైతులు కనీస మద్దతుధర కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఒకవైపు కోత కోసి మడుల్లోనే ఉంచిన ధాన్యం చేళ్లని పొలంలోనే చిన్న చిన్న దిబ్బలుగా వేయడానికి సిద్ధమవుతున్నారు. మబ్బులు చూసి ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు ఏం చేయాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

కొనుగోలు కేంద్రాలేవీ

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఇంకా బాలారిష్టాల మధ్య కొనసాగుతోంది. ఈ ఏడాది పూర్తి స్థాయిలో రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. బ్యాంకు గ్యారంటీ లేని రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాదిలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు చాలా చేదు అనుభవాలు చవిచూశారు. ప్రభుత్వం, రైస్ మిల్లర్లు మధ్య అవగాహన లేకపోవడంతో స్థానిక మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయలేదు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రైస్ మిల్లర్లను తీసుకొచ్చి జిల్లా అధికారులు ధాన్యం కొనుగోలు చేయించారు. పేరుకు కనీస మద్దతు ధర ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం పైకి చెపుతున్నా కింద స్థాయిలో అది సాధ్యం కావడంలేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు ధాన్యం కొనుగోలులో రైతులకు గుదిబండగా మారుతున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు



విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సమర్థవంతంగా పనిచేయాలి

విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులను నివారించుటకు జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టరు నిశాంత్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టరు అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ అంటరానితనం, అత్యాచారం, దాడులకు గురైన బాధితులకు సత్వరన్యాయం, పరిహారం అందించాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటుచేసిన కమిటీ సభ్యులు సేవాభావంతో పనిచేయాలని తెలిపారు. కేసుల నమోదులో జాప్యం ఉండకూడదని, అవసరమైన ధ్రువపత్రాలు వెంటనే బాధితులకు అందించాలని అధికారులను ఆదేశించారు. కేసు ఛార్జిషీటు ఉన్నతాధికారులకు వెంటనే పంపించాలన్నారు. డివిజనల్ స్థాయి సమావేశాలు నిర్వహించి కేసులపై సమీక్ష నిర్వహించాలన్నారు. బాధితులకు అత్యధిక పరిహారం అందించాలని, రెండు లేక అంతకంటే ఎక్కువ సెక్షన్ల ప్రకారం పరిహారం అందే అవకాశం ఉంటే పరిశీలించాలని తెలిపారు. సరైన సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పరిహారంతోపాటు కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన అంబేద్కర్ సహాయ నిధి నుండి కూడా పరిహారం అందించుటకు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. నెలలో ఆఖరి వారంలో ఒకరోజు తహశీల్దార్లు ఒక గ్రామాన్ని సందర్శించాలని ఆదేశించారు. అంటరానితనంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. పెండింగులోని కేసుల వారీ వివరాలు, బాధితులకు అందించిన పరిహారంపై సమీక్షించారు. బాధితులు మైనర్లయితే బాలల సంక్షేమ కమిటీ వారిని పరామర్శించాలని, తరచూ వారిని కలుసుకొని మనోధైర్యాన్ని కల్పించాలని తెలిపారు. ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన కేసులపై త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఛార్జిషీటు కాపీలను కలెక్టరు కార్యాలయానికి, సంబంధిత అధికారులకు వెంటనే పంపించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ నిర్ణీత ప్రొఫార్మా-3 ద్వారా తీసుకోవాలని తెలిపారు.

జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ మాట్లాడుతూ జిల్లాలో 24 కేసులు నమోదయ్యాయని, 16 విచారణ దశలో ఉన్నాయని తెలిపారు. రెండు కేసులు కోర్టులో ట్రైల్ దశలో ఉన్నట్లు చెప్పారు. బాధితులకు అందించిన పరిహారం వివరాలను తెలియజేశారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టరు నూర్ ఉల్ కమర్, డిఆర్ఒ జె. వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎస్‌పిలు ఎ.సుబాష్, జి.వి.కృష్ణారావు, మురళీధర్, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు ఎం. దేవుళ్ల నాయక్, జిల్లా పశు సంవర్థక అధికారి ఎ.ఈశ్వరరావు, జిల్లా అగ్నిమాపకఅదికారి కె.శ్రీనుబాబు, కమిటీ సభ్యులు గునగంజి చంద్రయ్య, పిరపాక శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రహదారి కొలతలు వేస్తున్న అధికారులు

రహదారి కొలతలతో ఆందోళన

ప్రజాశక్తి-మక్కువ

మండల కేంద్రం మక్కువలో ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా కొలతలు వేయడంతో వ్యాపారులు, స్థానికుల్లో ఆందోళన మొదలైంది. బుధవారం సాయంత్రం మక్కువ రహదారిలో ఆర్‌అండ్‌బి జెఇ కమలాకర్ ఆధ్వర్యంలో కొలతలు వేశారు. రహదారి మధ్య నుంచి ఇరువైపులా 50 అడుగులు వచ్చేలా కొలతలు వేశారు. ప్రస్తుతం వేసిన కొలతలను ఆధారంగా చూస్తే ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న వాణిజ్య సముదాయాలు, ఇళ్లు పూర్తిగా తొలగిపోయే ఆస్కారం ఉంది. కొన్నేళ్లుగా ఆక్రమణలతో ప్రధానరహదారి ఇరుకుగా మారింది. ప్రస్తుతం నూతన రహదారి పనులు సాలూరు నుండి చేపడుతున్నారు. మండల కేంద్రంలో సుమారు 1.3 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారికి ప్రతిపాదించినట్లు జెఇ కమలాకర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. చినబోగిలి రహదారి కూడలి నుంచి దుగ్గేరు గోపాలపురం రోడ్డు జంక్షన్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం చేపడతామన్నారు. రెవెన్యూ అధికారులు ఇంకా భూమి పరిశీలన చేయాల్సి ఉందని తెలిపారు.

గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గిరిజనులు పండించే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని ఐటిడిఎ పిఒ బి.నవ్య వెల్లడించారు. బుధవారం గిరిజన ఉత్పత్తులకు సంబంధించిన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ జీడి, పైనాపిల్, పసుపు, కొండ చీపుర్లు వంటి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుటకు అన్ని చర్యలు తీసుకొంటామని అన్నారు. జీడి మార్కెటింగ్ చేయుటకు వీలుగా ఇటీవల జీడి ప్రొసెసింగ్ యూనిట్లను మంజూరు చేశామని, వాటిని త్వరితగతిన నిర్వహణలోకి తీసుకొస్తామని చెప్పారు. జీడి ప్యాకింగ్‌కి అవసరమయ్యే వస్తువులు, బార్ కోడ్, ఐటిడిఎ బ్రాండ్‌తో కూడిన లేబుల్స్ ఇస్తామన్నారు. ఔషధ మొక్కల కోసం ఒక ప్రాజెక్టు తయారు చేయాలని సూచించారు. ఇటీవల ఇచ్చిన డికెటి పట్టాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి, వారికి 1బి పత్రాలను జారీ చేయాలని తహశీల్దార్‌కి సూచించారు. ఈ సమావేశంలో డిహెచ్‌ఒ సత్యనారాయణరెడ్డి, జిసిసి డిఎం సంధ్యారాణి, పిఎఒ హరికృష్ణ, తహశీల్దార్ నరసింహమూర్తి, ఎంపిడిఒ గీతాంజలి, వైకెపి ఎపిడి నారాయణరావు, జిసిసి మేనేజర్ నర్సింహులు, డిటి కుమారి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ నవ్య

ఉమాకవి, దేవానంద్‌కు గురజాడ పురస్కారం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలానికి చెందిన సాహితీ చైతన్య కిరణాలు, బాల కథానిలయం అధ్యక్ష, ఉపాధ్యక్షులు బోగెల ఉమామహేశ్వరరావు (ఉమాకవి), పాలక దేవానంద్‌కు గురజాడ పురస్కారం లభించింది. తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురజాడ వర్థంతి సందర్భంగా ఆన్‌లైన్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు.

ఈ సమ్మేళనంలో గురజాడపై వారు రాసిన కవితలకు ఆ సంస్థ అధ్యక్షులు మూర్తి ప్రశంసా పత్రాలను అందజేశారు.



మంచంపై ఇద్దరు చొప్పున ఉన్న గర్భిణులు

బాలింతలకు మంచాల కొరత

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవల నాణ్యత పెరగడంతో పరిసర ప్రాంతాలతోపాటు సరిహద్దు ఒడిశా రాష్ట్రం నుండి కాన్పుల కోసం గర్భిణులు ఈ ఆస్పత్రినే ఆశ్రయిస్తున్నారు. తాకిడి ఎక్కువ కావడంతో ప్రసవానంతరం బాలింతలు, శిశువులతో కలసి విశ్రాంతి తీసుకోవడానికి చాలినన్ని మంచాలు లేవు. ఒకే మంచంపై ఇద్దరిని పడుకోబెట్టి సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై సూపరింటెండెంట్ స్పందిస్తూ త్వరలోనే అదనపు గదులు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమస్యను అధిగమిస్తామని చెప్పారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మాణ సామగ్రి అందాల్సిందే

అధికారులకు కలెక్టర్ నిశాంత్ ఆదేశం

ప్రజాశక్తి కొమరాడ

ఇళ్ల నిర్మాణానికి సామగ్రి లబ్ధిదారులకు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కొమరాడలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సిమెంట్, ఇసుక, ఐరన్ తదితర మెటీరియల్ అందజేస్తున్నారని, బ్యాంకులతో మాట్లాడి రుణం ఇప్పించారని లబ్ధిదారులు తెలిపారు. కరెంట్ సమస్య కొంత ఉందని, దానివల్ల నీటిని దూర ప్రాంతాల నుండి తీసుకురావాల్సి వస్తోందని, నిర్మాణ పనులలో కొంచెం జాప్యం అవుతోందని వివరించారు. మహిళా సంఘాలకు బ్యాంకులు సకాలంలో రుణాలు అందజేయాలని, అందుకు బాధ్యత మీదేనని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ప్రతి లబ్ధిదారుడు గ్రౌండింగ్ చేసి, డిసెంబర్ నెలాఖరికి నిర్మాణం పూర్తి చేసి, గృహప్రవేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, ఎంపిడిఒ ఎస్.రమేష్, తహశీల్దార్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో సీతంపేట ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి డివిఎస్ రమణ బుధవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ రమణ

ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షులుగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షులుగా కె.నాగేశ్వరరావు (కురుపాం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కెవి ప్రవల్లిక, ట్రెజరర్‌గా బసవరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.కె గౌస్ మొహిద్దిన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లు, సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ల సంఘంలో ఎన్నికలు నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వానిది నమ్మక ద్రోహం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపుపై సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు ఆగ్రహం

ప్రజాశక్తి - కురుపాం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల ముందు హామీనిచ్చి.. ప్రస్తుతం తొలగించాలని చూడటం దారుణమని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక కాంప్లెక్స్ వద్ద సిఐటియు మండల నాయకులు ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆశా, విఆర్ఎ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ, అంగన్వాడీ, ఎండిఎం, వైకెపి తదితర స్కీమ్‌వర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం వారిని కార్మికులుగా మాత్రం గుర్తించడం లేదన్నారు. స్కీమ్‌వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, గ్రీన్ అంబాసిడర్లకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని చెప్పారు. ఉద్యోగ భద్రత, ఇతర హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకు సిఐటియు జిల్లా మహాసభలో పోరాట కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. పార్వతీపురంలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎ సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు కోలక అవినాష్, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు ఇందిర, ఆశావర్కర్ల సంఘం మండల నాయకులు సరోజిని, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొమరాడ : పార్వతీపురంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. మండలంలోని విక్రంపురం అంగన్వాడీ సెంటర్‌లో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, నాగమ్మ, రాధ, సుజాత పాల్గొన్నారు.

సీతంపేట : పార్వతీపురంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దావాల రమణారావు కోరారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్, కార్యదర్శి కాంతారావు, సభ్యులు దర్మిమి లక్ష్మి, బి.పార్వతి, రొయ్యభారి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు





సీతంపేట, కొమరాడలో సిఐటియు జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, స్కీమ్‌వర్కర్లు


జిసిసి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిఎం మహేంద్ర

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జిసిసి డిఎం మహేంద్ర

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

సేల్స్ మెన్లు, కాంట్రాక్టు సేల్స్‌మెన్లు, డీలర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యావసర వస్తువులు అమ్మకాలు చేపట్టాలని జిసిసి పార్వతీపురం డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్ సూచించారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం జిసిసి బ్రాంచ్ పరిధిలో పనిచేస్తున్న 46 డిపోలకు చెందిన సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు జరిగిన ఎంఎఫ్‌పి కొనుగోలు, రాబోయే సీజన్‌కు డిఆర్‌ఎస్ అమ్మకాల లక్ష్యాలపై సమీక్షించారు. కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. రైతులు, గిరిజనుల వద్ద నుంచి అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గిరిజనులకు ఇచ్చే వ్యవసాయ రుణాలపై వివరించారు. అనంతరం జిసిసి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కృష్ణప్రసాద్, అకౌంటెంట్ గణపతిరావు ఉన్నారు.

చెరువులను పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

చెరువులను పరిరక్షించుకునేందుకు యువత, మేధావులు ముందుకు రావాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్యసింహ చక్రవర్తి కోరారు. బుధవారం పార్వతీపురంలోని నెల్లిచెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణ, సాగునీరు, తాగునీరు తదితర వనరులను కల్పించే చెరువులను కొంతమంది అత్యాశపరులు కబ్జా చేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే భావితరాలకు నీరు దొరకని పరిస్థితి ఎదురవుతుందన్నారు. దీనిపై ఇప్పుడు మేల్కోకుంటే చాలా నష్టం తప్పదని, వెంటనే చెరువుల పరిరక్షణకు నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి మరిచర్ల కార్తీక్ నాయుడు, జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, నియోజకవర్గ కన్వీనర్ గేదెల రామారావు తదితరులు పాల్గొన్నారు.


వినతి అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, నాయకులు

ఎండిఎం కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ఆ యూనియన్ మండల కార్యదర్శి ఎ.పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ సూర్యనారాయణఖు బుధవారం వినతి అందించారు. ప్రతినెలా 5వ తేదీలోపు కార్మికుల వేతనాలు ఇవ్వాలని, పెరుగుతున్న రేట్లకు అనుగుణంగా బడ్జెట్ రూ.20 పెంచాలని కోరారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వంట గ్యాస్ ప్రభుత్వం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, పద్మ, ఎస్. బేగం, ఎ.అలివేలు, జయలక్ష్మి పాల్గొన్నారు.


మహిళా పోలీసుకు నగదు బహుమతి అందిస్తున్న డిఎస్‌పి సుభాష్

మహిళా పోలీసులకు ప్రశంసలు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని గలావిల్లి, గంగాడ మహిళా పోలీసులు ప్రతిభ కనబరచడంతో ఎస్‌పి విద్యాసాగర్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ మేరకు బుధవారం ఇద్దరికి డిఎస్‌పి సుభాష్ నగదు బహుమతి అందించారు. గ్రామాల్లో మద్య నిషేధానికి మహిళా పోలీసులు చేసిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.ప్రశాంత్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-విజయనగరం

ఆగ్రో రైతు సేవా కేంద్రాల కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆగ్రోస్ జిల్లా మేనేజరు తెలిపారు. ప్రభుత్వం మండలానికి ఒక ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంజూరు చేశారని, ఈ కేంద్రం ద్వారానే వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు రైతులకు విక్రయించాల్సి ఉందని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత సైన్స్ పట్టభద్రులై ఉండి స్థానికంగా ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 9 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మేనేజరు, ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్, విజయనగరం, సెల్ 9989079452, 9948098534లను సంప్రదించాలని కోరారు.

పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) పిలుపుమేరకు విజయనగరం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.అప్పారావు, డి.శ్యామ్ మాట్లాడారు. 2022 మార్చిలో చెల్లిస్తామని చెప్పిన పిఆర్‌సి బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని, పిఆర్‌సి అమలు అనంతరం ప్రకటించాల్సిన రెండు డిఎలు ఇంతవరకు ప్రకటించలేదని తక్షణమే అవి ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి ఇప్పటివరకు ఎటువంటి డిఎ ఎరియర్స్ సిపిఎస్ ఉద్యోగులకు జమ చేయలేదని, వెంటనే అవి జమ చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ జీతాలు చెల్లింపులో జాప్యం సరికాదని, ఇప్పటికైనా సకాలంలో ప్రతినెలా ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒ ఎం.గణపతిరావుకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యలు పరిష్కారం జరగకపోతే రాష్ట్రస్థాయిలో ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కమిటీ కన్వీనర్ శ్రీనివాస దొర, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణరావు, బాలాజీ, సంఘ సభ్యులు, జాషువా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే ముందుగా ప్రణాళికలు వేసుకోవాలని డిపిఒ బలివాడ సత్యనారాయణ సర్పంచులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచుల శిక్షణ తరగతులలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీలో అభివృద్ధి చేయాలంటే నిర్దిష్టంగా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల పై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ రమణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందాలంటే ముందస్తు



డిపిఒ సత్యనారాయణ

ప్రణాళికలు అతి ముఖ్యమని, వీటిని తయారు చేసే బాధ్యత పంచాయతీలపైనే ఉందని ఎంపిపి కె.దీనమయ్య అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో అభివృద్ధికి పంచాయతీలే ముఖ్యమన్నారు. పంచాయతీలు అభివృద్ధి చెందితే రాష్ట్రంగానీ, దేశం గాని అభివృద్ధి చెందేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలన్నింటినీ గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో సమ్మిళితం చేసి ప్రభుత్వ పథకాల అనుసంధానంతో ఈ ఏడాది అభివద్ధి ప్రణాళికలు తయారు చేయాల్సిన ఆవశ్యకత అందరిపైన ఉందని అన్నారు. గ్రామస్థాయిలో ప్రణాళికల ఆవశ్యకత, ప్రణాళికల ప్రజా ఉద్యమం వాటి లక్ష్యాలు, గ్రామ పంచాయతీ అభివృద్ధిపై శిక్షకులు చెప్పిన అంశాలను అవగాహన పరుచుకోవాలని కోరారు. అనంతరం



గుమ్మలక్ష్మీపురం.. జ్యోతిప్రజ్వలను చేసి శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపిపి దీనమయ్య ; సీతంపేట.. మాట్లాడుతున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ


వీరఘట్టం.. మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ

ఇన్‌చార్జి ఎంపిడిఒ జగదీష్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీకి శిక్షణ ప్రజాప్రతినిధులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాధిక, వైస్ ఎంపిపిలు ఎన్.శేఖర్, బి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలని డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ అన్నారు. స్థానిక వైటిసిలో సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. పంచాయతీల విధులు, నిధుల గురించి అవగాహన కల్పించారు. నిధుల్లో దేనికి ముందు ప్రాధాన్యత ఇవ్వాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది అరాచక పాలన

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి


సీతానగరం.. మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి విమర్శించారు. బుధవారం మండలంలోని కొట్టుపరువు, యరగడవలస, చింతలవలస గ్రామాల్లో 'ఇదేం కర్మ ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. హింసాత్మక ఘటనలు, దౌర్జన్యాల గురించి వివరించారు. ప్రభుత్వం ప్రజలపై ఎలాంటి భారాలు మోపుతుందో తెలియజేశారు. నవరత్నాల పేరుతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయకుండా మోసగిస్తోందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సాలూరు, మక్కువ మండలాల అధ్యక్షులు జి.వేణు, పరమేష్, వెంకటరమణ, మచ్చయ్య, ఎ.తిరుపతి రావు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో ఇదేం కర్మ

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ గత మూడేళ్లలో నిరుద్యోగ సంఖ్య పెరిగిందని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని ఆందోళన వ్యక్తంచేశారు. పేదల జీవనం దుర్భరంగా మారిందన్నారు. వీటన్నింటికీ కారణమైన వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, గర్భాపు ఉదయభాను, మండల అధ్యక్షులు కుళ్ల తిరుపతిరావు, ఆర్.వేణునాయుడు, మాజీ సర్పంచ్ వి.గొంపస్వామి, నాయకులు బి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, కె.సురేష్, ఎం.శంకర్రావు, వై.రామనాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

స్మార్ట్‌ఫోన్‌కు బానిస కావొద్దు

సిఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సాలూరు

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు చెప్పారు. స్మార్ట్ ఫోన్‌కు బానిసైతే చదువుపై శ్రద్ధ వహించలేరని చెప్పారు. బుధవారం పట్టణంలోని దీప్తి హైస్కూల్లో విద్యార్థులకు మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కష్టపడి చదవడం ఒక్కటే మార్గమని అన్నారు. కన్న తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యాసంస్థలకు మంచిపేరు తేవాలంటే చదువులో ప్రతిభ కనబరచాలని కోరారు. టౌన్ ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కాశి నాయుడు, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం, బూర్జ గాదెలవలస, రంగంపేట గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ బి.కృష్ణమహేష్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యుబిసి సెంటర్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన


ప్రజాశక్తి-పాలకొండ

దిశయాప్‌పై మహిళల్లో మరింత అవగాహన కల్పించాలని దిశ చట్టం డిఎస్‌పి హర్షిత చంద్ర అన్నారు. బుధవారం ప్రయివేట్ కల్యాణమండపంలో దిశ యాప్‌పై మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాప్ వల్ల మహిళలకు రక్షణ కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని సచివాలయ పరిధిలో మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.శివప్రసాద్ పాల్గొన్నారు.

కార్యదర్శులు లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సచివాలయ కార్యదర్శులు అభివృద్ధి పనులను వేగవంతం చేసి, పనుల లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపిడిఒ అకిబ్ జావేద్ అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీ ఇళ్లు, కాలువలు, రహదారులతోపాటు ఇంటిపన్ను, చెత్తపన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ప్రగతిలో వెనుకబడ్డవారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కృష్ణుడు పాల్గొన్నారు.


పచ్చని కొండపై మంచు


ఏజెన్సీ గ్రామంపై మంచుదుప్పటి

మైమరపించే మన్యం అందాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రతి ఏటా శీతాకాలం నాలుగు నెలల పాటు గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ అందాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఆకాశాన్ని తాకేలా ఎత్తయిన కొండలు, మనసుని ఆహ్లాదపరిచే పచ్చని వాతావరణం, గిలిగింతలు పెట్టే శీతల గాలులు, గలగల పారే అందమైన సెలయేళ్లు, దట్టమైన అడవులు, ఒంపులు తిరిగే రహదారులు.. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రూపం ఆవిష్కృతమవుతోంది. ఇవి చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఊటి, కొడైకెనాల్ తర్వాత గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో తోటగోరటి ప్రాంతాలు ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తున్నాయి. మరోవైపు తాడికొండ జలపాతం, ఎస్.కె.పాడు ఉద్యానవనం పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక్కడికి ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు.


పర్యాటకులను ఆకట్టుకునేలా విల్లు ఆకారంలో ఎస్‌కెపాడు నర్సరీ ముఖద్వారం


తాడికొండ జలపాతం వద్ద పర్యాటకుల సందడి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిపిటిఒ సుధాకర్, డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి -భామిని

ఇటీవల ప్రజాశక్తిలో ప్రచురితమైన 'బస్సు ఎక్కాలంటే కుస్తీ పట్టాల్సిందే' కథనానికి ఆర్‌టిసి అధికారులు స్పందించారు. బుధవారం డిపిటిఒ సుధాకర్, పాలకొండ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు.. భామిని ఆర్‌టిసి కాంప్లెక్స్‌ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. రోజు వారి బస్సు సమస్య, షెల్టర్ లేకపోవడంతో షాపు దగ్గర వేచి ఉండాల్సి వస్తోందని విద్యార్థులు తెలిపారు. బస్సు వచ్చేటప్పుడు పరిగెత్తాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు స్పందిస్తూ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ముందుగా కాంప్లెక్స్ ముందున్న కాలువ వద్ద పూర్తి స్థాయిలో పైప్‌లైన్ వేస్తే తప్ప బస్సు లోపలికి వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఈ అంశాన్ని ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.


పి.లేవిడి నుంచి నీలకంఠపురానికి నిర్మిస్తున్న బిటి రోడ్డు

శరవేగంగా రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - కురుపాం

దీర్ఘకాలిక సమస్యగా ఉన్న పి.లేవిడి నుంచి నీలకంఠపురం రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు సమస్యకు మోక్షం కలగడంతో తూర్పు ముఠాలో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ధాన్యం కొనుగోలు పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని పాపమ్మవలసలో ఆర్‌బికె వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియను బుధవారం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ పరిశీలించారు. రైతు మరడాన త్రినాథ్ నాయుడు కళ్లంలో ధాన్యం పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్ర సిబ్బందితో మాట్లాడుతూ గోనె సంచులు, రవాణా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు ఏర్పాటు చేస్తామని, రైతు రవాణా పెట్టుకుంటే ఆ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ అవినాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ వరహాలు

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పని ప్రదేశాలలో మహిళలపై జరిగే వేధింపులను నిరోధించాలని ఐసిడిఎస్ పీడీ జి.వరహాలు పిలుపునిచ్చారు. బుధవారం బందలుప్పి, డి.కె.పట్నం గ్రామాలలో పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు, నివారణ, నిషేధం, సంస్కరణలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వేధింపులకు పాల్పడితే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పని ప్రదేశాలలో మహిళలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పురుషులతో పాటుగా స్త్రీలకు సమానవేతనం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.